# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-12-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఆంధ్ర ప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కృషి చేస్తామని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు.**
2. **సమాజంలో ఆడపిల్లలను రక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు.**
3. **ఇంధనాన్ని పొదుపుగా వినియోగించడంలో ఆంధ్ర ప్రదేశ్ జాతీయ పురస్కారం కైవసం చేసుకుంది.**
4. **అపరిష్కృత కేసుల పరిష్కారం కోసం రాష్ట్రంలో నిర్వహించిన లోక్ అదాలత్ లకు విశేష స్పందన లభించింది**
5. **ఈ నెల 17, 18 తేదీలలో కోస్తా, రాయలసీమ ప్రాంతాలలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.**

==========================

ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరహార దీక్ష చేపట్టి అమరుడైన పొట్టి శ్రీరాములు వర్ధంతి ఈరోజు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు 1952 అక్టోబర్ 19 వ తేదీన ఆమరణ నిరహార దీక్ష చేపట్టి .... ఆ దీక్షలోనే 1952 డిసెంబర్ 15 వ తేదీన కన్నుమూశారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా "ఆత్మార్పణ దినం" గా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఆయా జిల్లాల మంత్రులు ..., శాసన సభ్యులు ..., అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు.

విజయవాడలో జరిగిన అధికారిక కార్యక్రమంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ..., ఉపముఖ్య మంత్రి కె. పవన్ కళ్యాణ్ ...., పలువురు మంత్రులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి వారు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ .... తెలుగు జాతి కోసం ఆలోచించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితో రాష్ట్రం అన్ని రంగాలలో సర్వతో ముఖాభివృద్ధి సాధించేలా అవిశ్రాంత కృషి చేస్తామని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ ....

.....వాయిస్.... 35 సెకన్లు....

---------------------------

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో ఈ నెల 17వ తేదీన జరగనున్న అఖిల భారత వైద్య శాస్త్రాల సంస్థ ....ఎయిమ్స్ ... తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొంటారు. 17 వ తేదీన ఆమె మధ్యాహ్నం డిల్లి నుండి గన్నవరం చేరుకుని అక్కడ నుండి మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఈ సంస్థ ఎం.బి.బి.ఎస్. 2018 తొలి బ్యాచ్ విద్యార్థులలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ..., ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ....,కేంద్ర ..., రాష్ట్ర ఆరోగ్య ..., కుటుంబ సంక్షేమ శాఖల మంత్రులు జె.పి. నడ్డా..., సత్య కుమార్ యాదవ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

---------------------------

సమాజంలో తల్లిదండ్రులు ఆడపిల్లలను ఎంత బాధ్యతగా పెంచుతున్నారో మగ పిల్లలను కూడా అంతే బాధ్యతతో పెంచాలని హొం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో "సేవ్ ది గర్ల్" నినాదంతో ఈరోజు జరిగిన రెండు కిలోమీటర్ల పరుగులో ఆమె పాల్గొని మాట్లాడుతూ .... ఆడపిల్లలను రక్షించుకోవలసిన బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పిలుపు నిచ్చారు. ఇళ్లలో తల్లి దండ్రులే పిల్లలకు పోలీసులు గా వ్యవహరించాలని మంత్రి అనిత పేర్కొంటూ

.....వాయిస్.... 28 సెకన్లు....

---------------------------

ఇంధనాన్ని పొదుపుగా వినియోగించడంలో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రతిష్ఠాత్మక "నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్" పురస్కారం -2024 లభించింది. భవనాలు ..., పరిశ్రమలు ...., పురపాలక సంఘాలు ..., వ్యవసాయం ...., రవాణా రంగాలలో ఇంధన పొదుపు ..., సామర్థ్య చర్యలను ప్రోత్సహించి ..., అమలు చేసినందుకు రాష్ట్రానికి ఈ పురస్కారం దక్కింది. ఇంధన పొదుపు అంశంలో ఆంధ్ర ప్రదేశ్ ఉత్తమ పనితీరు కనబరచి స్టేట్ ఎనర్జీ ఎఫిషియన్సి ఇండెక్స్ .... ఎస్. ఈ.ఈ.ఐ. 2024 లో 87.25 పాయింట్లు సాధించింది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరపున ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శి కుమార్ రెడ్డికి కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీపాద నాయక్ ఈ పురస్కారాన్ని అందజేశారు.

---------------------------

న్యాయ స్థానాలలో అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించే కృషిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిన్న జరిగిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. ఒక్క రోజులోనే 84 వేల 928 కేసులు పరిష్కారమయ్యాయి. కక్షిదారులకు మొత్తం 53 కోట్ల 27 లక్షల రూపాయల మేర పరిహారాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ .. ., రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షులు జస్టిస్ జి. నరేందర్ ...., హై కోర్టు న్యాయ సేవల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ రవినాథ్ తిల్హారీల మార్గదర్శకత్వంలో నిన్న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలలో 374 లోక్ అదాలత్ బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు.

---------------------------

రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం ...., చేనేత ...., జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత ఈరోజు తిరుపతి అన్నమయ్య సర్కిల్‌లోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు సమకూరుస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఈ అంశంపై తిరుపతి ఆకాశవాణి ప్రతినిధి జగదీష్ మరిన్ని

వివరాలు అందిస్తారు.

.....వాయిస్.... 25 సెకన్లు....

---------------------------

ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్, చలనచిత్ర దర్శకుడు... సత్తిరాజు వెంకట లక్ష్మీనారాయణ.. బాపూ జయంతి ఈరోజు. బాపూగా తెలుగు నాట తన గీతతో, రాతతో సుస్థిర స్థానాన్ని పొందిన ఆయన 1933 డిసెంబరు 15వ తేదీన జన్మించారు. అసంఖ్యాకంగా బాపూ గీసిన అందమయిన, అద్భుతమయిన చిత్రాల కారణంగా 'బాపు బొమ్మ' అనే మాట ఈరోజు చిత్రశైలిని ఉటంకిస్తూ వాడటం విశేషం. చక్కటి గీత, నొప్పించని హేళన, మొత్తం మీద అందంగా కనిపించే బొమ్మ-తెలుగు కార్టూన్‌లలో ఈ లక్షణాలు ఉన్న సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన బాపు ఎన్నో హృద్యమైన చలనచిత్రాలను తెరకెక్కించారు.

---------------------------

చిత్తూరు జిల్లా ఐరాల మండలం బొమ్మ సముద్రం గ్రామాన్ని స్థానిక ప్రజల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామని బొమ్మ సముద్రం పంచాయతీ కార్యదర్శి వై. మౌనిక తెలిపారు.

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా బొమ్మ సముద్రం సర్పంచ్ పి. రఘు ఉత్తమ పంచాయతీ పురస్కారం అందుకున్నారు. సందర్భంగా మౌనిక మాట్లాడుతూ ... ఈ పురస్కారం రావడానికి కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ రోజు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం రెండు రోజులలో పశ్చిమ వాయవ్య దిశగా పయనించి తమిళనాడు తీరం దిశకు రానున్నది. దీని ప్రభావంతో ఈ నెల 17 ..., 18 తేదీలలో కోస్తా ...., రాయలసీమ ప్రాంతాలలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. నెల్లూరు .... , ప్రకాశం ... తిరుపతి ... చిత్తూరు ..., అన్నమయ్య జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

---------------------------

మహాత్మాగాంధీతో స్వాతంత్ర్య సంగ్రామంలో యధాశక్తి పాలుపంచుకుని దేశసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన భారతరత్న సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ వర్ధంతి ఈరోజు. 1875 అక్టోబర్ 31వ తేదీన గుజరాత్‌లోని ఒక కుగ్రామం నదియాద్‌లో జన్మించిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ తన ధృఢతరమైన నిర్ణయాలతో ఉక్కుమనిషిగా పేరు పొందారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 6 వేల 149 సాగు నీటి సంఘాలకు గానూ 5 వేల 946 సాగు నీటి సంఘాలకు నిన్న ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. వీటిలో 95 శాతానికి పైగా సంఘాలకు అధ్యక్ష ...., ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 103 సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. కర్నూలు ...., నంద్యాల ...., అన్నమయ్య .. , బాపట్ల ..., అల్లూరి సీతారామరాజు..., గుంటూరు ..., కృష్ణా ..., ఎన్.టి.ఆర్. .., పశ్చిమ గోదావరి ..., అనకాపల్లి ..., విశాఖ పట్నం ...., విజయనగరం తదితర జిల్లాలలో ఎక్కువ సంఖ్యలో సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.

====================